# కాలేజీగోడ

= రచన: 'చిత్రభాను' =

నాకు ఊహ వచ్చిన దగ్గర్నుంచీ కాలేజీగోడ చూస్తున్నాను. డిగ్రీ పుచ్చుకొని ఇరవై ఏళ్ళు అవుతుంది. గోడ చెయ్యెత్తితే అందేపాటి వుంటుంది.

ఏ పత్రికా ప్రచురించలేని సాహిత్యం ఆ గోడమీద నాకు రోజూ అగుపిస్తుంటుంది. లోపలిగోడ ఒక రకమైన శీర్షికలతో అలరారితే బజారువైపుండే గోడ వింతవింత శీర్షికలతో నిండిపోయేది! కాలేజీ ప్రిన్సిపాలు సంవత్సరానికొకసారి సున్నాలు వేయించేవారు, వెంటనే పండక్కి ఒక స్పెషల్ యిష్యూ వచ్చేది. పాతవన్నీ చెరిగిపోయి నవ్యత వచ్చేది.

మసిబొగ్గులతో రాయడం చూసిన ప్రిన్సిపాలు నల్లసున్నం (తారు) వేయించారు. హాయిగా సుద్దముక్కలతో గోడ రచయితలు రాసుకొనేవారు. సున్నం పొడిపించి ఒట్టి ఇటికనే వుంటే బాగుండుననుకొన్నాను.

ప్రత్యేక గోడ సాహిత్య సంచిక విడుదలకై సిద్ధంగా వుంది. రచనలు వస్తున్నాయి. గోడ ఎడిట్ చేస్తోంది. అవతలి గోడగురించి రాస్తాను.

ముందొకడు 'విఘ్నేశ్వరాయనమః' అని రాశాడు. దానిక్రింద బొగ్గుతో ఆ దేవుని బొమ్మ రాశాడు ఇంకొకడు. మరో ఆర్టిస్టు గణపతికి ఇన్‌షర్టు వేసి కూలింగ్ స్పెక్ట్స్ తగిలించి కాళ్ళకు బూటు వేసి చక్కాపోయాడు. దానిక్రింద ఇంగ్లీషులో గణపతిరావ్! గుడ్ మార్నింగ్!—అని రాశాడు.

మర్నాడు మరో ఆర్టిస్టు వచ్చి గణపతి బొజ్జ పెద్దది చేసి దానిమీద 'ఉండ్రాళ్ళు' అని రాశాడు. సాయంకాలం చూసేసరికి ఉండ్రాళ్ళక్రింద బాదంహల్వా-సేమ్యా, లడ్డు, మైసూర్‌పాక్ రాశాడు.

గణేశ్ స్తుతి అయిపోయింది.

కార్టూన్లు ప్రారంభించారు.

స్త్రీబొమ్మ ఒకడు వేశాడు. పాపం భగ్నప్రేమి వద్దైన రచయితేమో వచ్చి కళ్ళ దగ్గర బాణం మార్కు పెట్టి విషపుకప్పులు అని, జడను త్రాచుపాము అనీ రాశాడు. నయనాలు మత్తెక్కించేవని సఫల ప్రేమికుడు రాశాడు. ఆరేడు భావాలు ఆ గోడమీద కనిపిస్తుంటాయి.

రోడ్డుమీద షికారు పోతున్నపుడు ఒక కన్ను ఆ గోడమీద వేసేవాడ్ని. రోజూ వింతవింతగా అగుపించి కలర్‌ఫుల్‌గా వుండేది. సైకిల్‌మీద పోయేవారు గోడ ప్రక్కగా స్లో చేసి వెళ్తుండేవారు. ఎవరికీ ఆ గోడ సాహిత్యం మీద ఇంట్రస్ట్ లేనట్లే వెళ్తుండేవారు! కాని కొంచెం అయినా చూడందే వెళ్ళేవారు కాదు. వెళ్ళేవారిలో గోడ రచయితలుకూడా వుంటారనుకొంటాను. వారు గప్‌చిప్‌గా నడుస్తుంటారు. పాఠకులు ఎలా విమర్శిస్తున్నారో పరీక్షిస్తుండేవారు. వాళ్ళు చేసే రిమార్కులను శ్రద్ధగా వినేవారు.

కార్టూన్లు బ్రహ్మాండంగా వుండేవి. శంకర్స్ వీక్లీ ప్రతినిధి ఇక్కడెవరయినా వుంటే బాగుండుననుకొనేవాడ్ని. ప్రపంచ కార్టూన్ల పోటీకి ఈ గోడ ఆర్టిస్టును పంపితే రిమ్యూనరేషన్ వచ్చేది. టౌన్‌లోని ప్రకటనకర్తలు కూడా అవతలి గోడను వారి ఎడ్వర్టైజ్‌మెంట్స్ కోసం ఉపయోగించుకొనేవారు.

ఒకసారి 'బి. యస్. సి. జోళ్ళు వాడండి' అని తారుతో రాయించారు. బి. యస్. సి. జోళ్ళను బి. యస్. సి. వాళ్ళు వాడితే బాగుండునని గోడ రచయితెవరో రాశాడు. ఎవరికేది ఆనందంగా తోస్తే అది అక్కడికి వెళ్ళి రాసేవారు. రాస్తున్నప్పుడు మాత్రం నేనింతవరకు ఎవర్నీ చూడలేదు. అర్ధరాత్రిని రాసేవారేమో! జన సంచారం తగ్గేటప్పుడు వాళ్ళపని చేసుకొనేవారేమో!!

ఒకొక్కసారి అశ్లీలంగా అసభ్యంగా వుండేవి. వాటిని చూసేటప్పుడు చాలా బాధగా వుండేది. అవి ఇక్కడ విపులీకరించడం బాగుండదు. ఒక అమ్మాయి ఫోటో వేసి నోటిదగ్గర ఏదో పెట్టి 'ఓ నిర్దయీ ప్రీతమ్' అని రాసివుంది. మర్నాడు ఆ అమ్మాయి ముందు మరో అబ్బాయి ఫోటో వేసి వీడి నోటినుండి ఆమె చెవికి బాణం పెట్టి 'దుష్యంతుడు లేకపోతే నేనున్నానులే'-అని రాశాడు.

కొంపలు తీసే బాణాల గుర్తులు పెట్టేవారు. నీతి దిగజారిపోతోందేమో నని భయపడేవాడ్ని! నగ్నంగా

చిత్రాలు టైటిల్ పేజెస్ మీద వేసి లోపల బాత్‌రూమ్ ఫొటోలు వేసి బ్రతికే పత్రికలు జ్ఞాపకం వచ్చేవి. రకరకాల వర్ణచిత్రాలు రంగురంగుల సుద్దముక్కలతో వేసేవారు. గోడలో ఒక అంగుళం ఖాళీ లేకుండా రచయితలు!

గజిబిక్క, బజిముక్క, ద్రాక్ష తొక్క. కావాలోయ్ నవకవనానికి అని పారడేస్ కూడా రాసేవారు.

ఇమిటేషన్ సాహిత్యం బాగానే వుండేది. ఖాళీ స్థలంలో ఒకడు '...రు' అని రాసి ఊరుకొనేవాడు. దాని క్రింద వరసగా అంత్యప్రాసతో కారు, నారు, తారు, పారు, పోరు, కోరు, నోరు, ఏరు, అని ఎన్నో రాశేవారు. మరొకటి "...రువు" కి అరువు, బరువు, కరువు, తెరువు ఇలా నింపేవారు. ఎవరెక్కువ పదాలు రాస్తే దాని క్రింద 'మేం గెల్చేశాం' అని గర్వంగా ఎవరెష్టు విజేతుల్లా రాసేవారు. ఎవరు గెల్చినా ఓడిపోయినా దెబ్బలాటలుండేవి కావు. కారణం దాని మీద రాసే హక్కు అందరికీ వుంది. ఝగడాలు వచ్చినా ప్రత్యక్షంగా రావు, పరోక్షంగానే! సుద్దముక్కలే రివాల్వర్స్ వాళ్ళకి. డెమోక్రసీని పూర్తిగా వినియోగించుకొనే వారక్కడ.

సిటీలోని సినిమాల లిష్టు అంతా అక్కడ వుండేది. ధరవరలు కూడా రాస్తుండేవారు. కొత్తగా మా వూరు ఎవరైనా వస్తే కాలేజీ గోడకి వచ్చేస్తేచాలు. అన్ని విషయాలు ఎవర్నీ అడక్కుండానే తెల్సిపోతాయి. టూరిష్టు గైడ్‌లా వుండేది.

భోగీమంట! చౌ-ఎన్-లై ఆకారంలో వున్న చెట్టును ఎవరో మంటలో పడేయటానికి తీసుకువస్తున్నారు. అందరి నవ్వులు—ఈ కార్టూన్ నచ్చింది. ప్రణయ కవిత్వం, ఆకలి కవిత్వం, సామెతలు, దండకాలు, సినిమా పాటలు, కార్టూన్‌లు. జోక్స్, విట్స్, రకరకాలయిన ఫోటోలలో అమ్మాయిల అబ్బాయిల బొమ్మలు- వీటన్నిటి సమ్మేళనమే కాలేజీ అవతలి గోడ!

ఇక లోపలి గోడ చూద్దాం! దీనిపై కాలేజీ వర్రాళ్ళకే రాసే హక్కు ఉన్నది. కనుక అవతలి గోడంత అశ్లీలంగా వుండదు కాని కొంచెం పాలిష్‌కు అశ్లీలం వుంటుంది. అవతలి పత్రిక కన్న కొంచెం స్టేండర్డులో వుంది.

'కాలేజీ బ్యూటీ కృష్ణవేణి రాలేదు'

'కాలేజీకి సెలవెందు కియ్యలేదు?'

'ముసలి ప్రిన్సిపాలుకు మహబ్బత్ గురించి ఏం తెలుసు?

'ఆమె క్లాసులో లేకపోతే మనకు పాఠాలు బోధపడవని రిపోర్టు చేసినా బాగుండును'

ఇలా ఒకటి తర్వాత ఒకటి రాసుకుపోతూంటారు.

పరీక్షలు దగ్గరకొచ్చేటప్పుడు:-

మార్చి సెల అంటుంది:—నిన్ను వదలి నేను పోనులే.

సెప్టెంబరు—అది నిజములే.

పెద్దవాళ్ళవి, వాళ్ళ స్వంతంవి కొటేషన్లు రాస్తుంటారు ఒక్కొక్కప్పుడు.

లవ్ ఈజ్ బ్లైండ్-అని ఒకరు రాస్తే—

బ్లైండ్ ఈజ్ లవ్-అని మరొకరు రాస్తారు.

'మీ నాన్న పేరు ఆక్సిజన్'

'మీ అమ్మ పేరు హైడ్రోజన్'

'నీ పేరు వాటర్ (H. 20)' —అని రాస్తాడు ఒక B. Sc స్టూడెంట్.

అశ్లీలం తోచినా తెలివికి మెచ్చుకోవాలి.

Dont be silly!
My dear lilly-అంటాడు మరొకడు.

'కృష్ణవేణి పౌడర్ సెంటీమీటర్ దళసర్ని రాసింది'

'కృష్ణవేణి జడ కృష్ణారావు మెడకు తగిలింది'

'వాళ్ళిద్దరూ సినిమాకు వెళ్ళారు'

ఎప్పటి వార్త అప్పుడే లిఖిత రూపంలో గోడమీదికి వస్తుంది.

'కృష్ణవేణి హృద్యోగంవల్ల గుటుక్కు!'

'కృష్ణారావు ఆత్మహత్య'

ప్రేమాధ్యాయం ముగిస్తుంది.

లెక్చరర్లకు స్టూడెంట్స్ యిచ్చే టైటిల్సు రాష్ట్రపతి బిరుదుల్లాగా చచేవారకు నిల్చిపోతాయి.

'ముసలి పెళ్ళికొడుకు' కార్టూన్ వేశాడొకడు. బ్రాకెట్‌లో లెక్చరర్ పేరు రాశాడు. ఆ లెక్చరర్ ఒకవేళ చూస్తే బాధ పడడూ?

Hall Tickets యిచ్చిన తర్వాత ఎక్కువమంది నెంబర్లు గోడమీదే వుంటాయి.

స్ట్రయిక్ వార్తలు రాస్తారు!

'ఫస్ట్ యియర్ పబ్లిక్ తీసేయమని 29 నుండి స్ట్రయిక్!' దానిక్రింద

'పరీక్షలే తీసేస్తే బాగుండును'

'కాలేజీ తీసేస్తే బాగుండును' అని మరొకడు.

రష్యావాడు రాకెట్టు పంపిన తేదీ, కెనడీ చనిపోయిన తేదీ, కీలర్ కేసు తేదీ అన్నీ వుంటాయక్కడ.

గోడ పత్రికలు రిఫరెన్సు వర్కు చేసుకోవడానికి పనికివస్తాయి. R. D. సంపాదించవచ్చు!

డబ్బిచ్చి కొనక్కర్లేని గోడ పత్రికలు!

రిమ్యూనరేషన్ కోరని కుర్ర రచయితలు!!